

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



బుధవారం 11-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :143 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ రాక!



భారత్ సమ్మిట్‌లో పాల్గొనే అవకాశం

గిగ్ వర్కర్లతో ప్రత్యేక భేటీ

బీసీ ప్రాతినిధ్యంపై కీలక చర్చ

మెగా బీసీ ర్యాలీకి ఆహ్వానం

నవంబర్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీ

2 లో

మూడు రోజులు చలి మంటలే!

29 జిల్లాలకు ఎల్లో అలర్ట్

ఏడు జిల్లాల్లో 12 డిగ్రీల చలి

ఆదిలాబాద్‌లో అత్యల్ప ఉష్ణోగ్రత

హైదరాబాద్‌లోనూ పెరిగిన చలి

తెల్లవారుజామున పొగమంచు హెచ్చరిక

చిన్నారులు, వృద్ధులు అప్రమత్తం



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం):

తెలంగాణలో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. రానున్న మూడు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 29 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జోగులాంబ గద్వాల, ఖమ్మం, సూర్యాపేట, జనగామ జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యే అవకాశముందని అంచనా వేసింది.ముఖ్యంగా సంగారెడ్డి, మెదక్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, వనపర్తి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని తెలిపింది.

పదవుల ప్రకటనతో రచ్చ..

24 గంటల్లోనే బ్రేక్!

తెలంగాణ కాంగ్రెస్‌లో నియామకాల గందరగోళం

24 గంటల్లోనే మీడియా పదవులకు బ్రేక్

తదుపరి ఆదేశాల వరకు నియామకాలు నిలిపివేత

జాబితాపై నేతల్లో తీవ్ర అసంతృప్తి

పీసీసీ చీఫ్‌కు ఫిర్యాదుల వెల్లువ

16 మందితో మీడియా ప్యానెలిస్టుల జాబితా

నలుగురికి మీడియా కో-ఆర్డినేటర్ల బాధ్యతలు

49 మందితో అధికార ప్రతినిధుల జాబితా

కాంగ్రెస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా నియామకాలు

2 లో

ప్రధాని కుర్చీ వద్దు.. పిల్లలే ముఖ్యం!

ప్రధాని పదవిపై సోనియా సంచలన విషయాలు

పిల్లల నుంచే తీవ్ర వ్యతిరేకత

ఇందిర, రాజీవ్ హత్యల భయం

కూటమి నేతల నుంచి ఒత్తిడి

రాహుల్, ప్రియాంకల నిలదీత

అంతరాత్మ మాటతో మారిన నిర్ణయం



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం):

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తాజాగా రాసిన తన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకంలో 2004 ఎన్నికల తర్వాత చోటుచేసుకున్న అనూహ్య రాజకీయ పరిణామాలు, ప్రధాని పదవిని తిరస్కరించడానికి దారితీసిన అసలు కారణాలను మొదటిసారిగా బహిర్గతం చేశారు. ఆ రోజుల్లో దేశ రాజకీయాలను కుదిపేసిన ఆ నిర్ణయం వెనుక తీవ్రమైన కుటుంబ ఆందోళనలు, అంతర్మథనం ఉన్నట్లుగా ఆమె తెలిపారు.

పిల్లల తీవ్ర వ్యతిరేకత.. 'అబ్సొల్యూట్లీ నాట్'

2004 లోక్‌సభ ఎన్నికలకు కొన్ని నెలల ముందే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రధాని పదవిని చేపడతారా అని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తమ తల్లిని ప్రశ్నించారట. అందుకు సోనియా గాంధీ ఏమాత్రం ఆలోచించకుండా 'అబ్సొల్యూట్లీ నాట్' అంటే ఖచ్చితంగా వద్దని బదులిచ్చారని ఆత్మకథలో వెల్లడించారు.

రైతుల పంతం నెగ్గింది.. కడెం నుంచి నీళ్లు!

రైతుల ఆందోళనకు ఫలితం

కడెం నుంచి 700 క్యూసెక్కుల విడుదల

చివరి ఆయకట్టుకు సాగునీరు

జన్నారం, దస్తురాబాద్ రైతులకు ఊరట

మంత్రులతో మాట్లాడిన ఎమ్మెల్యే బొజ్జు

రైతులకు ఎమ్మెల్యే భరోసా

2 లో

ఎల్‌నినో దెబ్బకు వర్కింగ్ డేస్‌లో మార్పు?

తెలంగాణలో ఐదు రోజుల పనిదినాలపై కసరత్తు

పనిగంటలు పెంచి పనిదినాలు తగ్గించే యోచన

ఉద్యోగ సంఘాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తి

సీఎం రేవంత్‌కు నివేదిక ఇచ్చేందుకు సిద్ధం

ప్రభుత్వ ఆఫీసులకే కొత్త విధానం పరిమితం?

హైదరాబాద్‌లో పెరుగుతున్న నీటి కష్టాలు

వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ఐటీ కంపెనీల మొగ్గు

2 లో

శబరిమల యాత్రకు కొత్త రూల్!



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం):

శబరిమల యాత్రకు సిద్ధమవుతున్న అయ్యప్ప స్వామి భక్తులకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం, తిరువాంకూర్ దేవస్వం బోర్డు అధికారులు అత్యంత కీలకమైన సూచనలు జారీ చేశారు. శబరిమలలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు ముందస్తుగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు.

డిజిటల్ అరెస్టులపై సుప్రీం కొరడా



డిజిటల్ అరెస్టులపై సుప్రీం సీరియస్

వాట్సాప్‌కు ధర్మాసనం నోటీసులు

రక్షణ చర్యలపై సమగ్ర నివేదిక

9,400 అనుమానాస్పద ఖాతాలపై చర్యలు

మోసాల కట్టడికి కొత్త సాఫ్ట్‌వేర్

నవంబర్ 23కి తదుపరి విచారణ

2 లో



ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

- 2029 లక్ష్యంగా చంద్రబాబు దిశానిర్దేశం
- స్థానిక విజయంతో పొంగిపోవద్దు!
- రూ.36 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్‌సిగ్నల్
- ఏపీకి ఏఐ డేటా సెంటర్ల క్యూ
- మహిళా పారిశ్రామిక పార్కుకు ఆమోదం
- నిబంధనలు ఉల్లంఘిస్తే భూములు రద్దు
- నిత్యావసర ధరల కట్టడికి సీఎం ఆదేశం
- ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలి!

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం): ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కేబినెట్ సమావేశం రాష్ట్ర అభివృద్ధి, పాలనాపరమైన అంశాలతో పాటు రాజకీయ, సంక్షేమ దిశానిర్దేశాలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశంలో సుమారు 30కి పైగా ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన విజయంపై మంత్రివర్గం హర్షం వ్యక్తం చేయగా, సీఎం చంద్రబాబు మంత్రులకు పలు కీలక సూచనలు చేశారు. స్థానిక ఎన్నికల విజయం చూసి గర్వంతో విర్రవీగిపోవద్దని, మరింత ఒద్దికగా ఉంటూ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ, 2029 లక్ష్యంగా అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మేలు చేయాలని పిలుపునిచ్చారు.

మిగతాది 2 లో..

ముగిసిన మరో బంధం

పవన్ దంపతుల విడాకులు

పరస్పర అంగీకారంతో నిర్ణయం

స్నేహితులుగా కొనసాగనున్న జంట

పిల్లల భవిష్యత్తే ప్రాధాన్యత

పవన్‌కు మూడోసారి విడాకులు

వ్యక్తిగత గోప్యతకు విజ్ఞప్తి



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం): ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి మరోసారి ఊహించని పరిణామం తెరపైకి వచ్చింది. పవన్ కళ్యాణ్ మరియు ఆయన భార్య అన్నా కొణిదెల (అన్నా లెజ్నెవా) తమ దాంపత్య బంధానికి ముగింపు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమ శ్రేయోభిలాషులు, సన్నిహితులను ఉద్దేశించి విడుదల చేసిన ప్రకటనలో ఈ జంట తమ విడాకుల నిర్ణయాన్ని ధ్రువీకరించింది. జీవితంలో ఎంతో విలువైన కాలాన్ని పంచుకున్న అనంతరం, పరస్పర గౌరవం మరియు సంపూర్ణ అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వైవాహిక బంధం ముగిసినా, తాము మంచి స్నేహితులుగా కొనసాగుతామని స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో మరో ఎన్నికల సమరం!

పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్

నవంబర్ 19న ఎంపీపీ ఎన్నికలు

20న జడ్పీ చైర్‌పర్సన్ల ఎన్నిక

చేతులెత్తే విధానంలో ఓటింగ్

ఎన్నికల్లో పార్టీల విప్ అమలు

నవంబర్ 14లోపు నోటీసుల జారీ



2 లో

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముగిసాయి.. ఇక, పరోక్ష ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 659 మండల ప్రజా పరిషత్‌లు (ఎంపీపీలు), 28 జిల్లా ప్రజా పరిషత్‌ల (జడ్పీపీలు) పరిధిలో కో-ఆప్టెడ్ సభ్యులతో పాటు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.ఇందుకోసం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలకు సంబంధించి కీలక షెడ్యూల్‌ను ప్రకటించింది.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 11-11-2026

శబరిమల యాత్రకు కొత్త రూల్!

మొదటి పేజీ తరువాయి

వర్చువల్ క్యూ స్లాట్ బుకింగ్ తప్పనిసరి..

శబరిమల శబరిమల క్షేత్రంలో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి, ప్రశాంత దర్శనం కల్పించేందుకు వర్చువల్ క్యూ విధానాన్ని అమలు చేస్తున్నారు. భక్తులు తమ యాత్ర ప్లాన్ చేసుకునే ముందే శబరిమల అధికారిక పోర్టల్ ద్వారా వర్చువల్ క్యూ స్లాట్‌ను ఖరారు చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా వచ్చే భక్తులకు దర్శన సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. భక్తులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా ఎంతో సులభంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేందుకు వీలుగా అధికారులు ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ను విడుదల చేశారు. భక్తులు తమ స్మార్ట్‌ఫోన్‌తో ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నేరుగా శబరిమల అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌కు చేరుకోవచ్చు. అక్కడ తమ వివరాలు, ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డు నమోదు చేసి ఉచితంగా వర్చువల్ క్యూ స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. మండల-మకరవిలక్కు ఉత్సవాల సీజన్ ప్రారంభమవుతున్న వేళ, దేశ నలుమూలల నుంచి వచ్చే అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, ముందస్తుగా వర్చువల్ క్యూ స్లాట్‌లు నమోదు చేసుకుని సహకరించాలని అధికారులు కోరారు.

పదవుల ప్రకటనతో రచ్చ.. 24 గంటల్లోనే బ్రేక్!



న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం):

తెలంగాణ కాంగ్రెస్‌లో మీడియా విభాగం పదవుల ప్రకటన తీవ్ర గందరగోళానికి దారితీసింది. సోమవారం అత్యంత ఆర్భాటంగా ప్రకటించిన మీడియా ప్యానెలిస్టులు, మీడియా కో-ఆర్డినేటర్లు, అధికార ప్రతినిధుల నియామకాలకు 24 గంటలు గడవకముందే బ్రేక్ పడింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ నియామకాలను నిలిపివేస్తున్నట్లు మంగళవారం తెలంగాణ కాంగ్రెస్ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతా ద్వారా ప్రకటించింది. టీపీసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేరుతో సోమవారం విడుదలైన ఈ జాబితాపై పార్టీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనట్లు తెలుస్తోంది. నియామకాల జాబితాపై పలువురు నేతలు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదులు చేయడంతోనే, అధిష్టానం ఈ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

సోమవారం ప్రకటించిన జాబితాలో ఏముంది?

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ మీడియా అండ్ పబ్లిసిటీ విభాగం చైర్మన్ పవన్ ఖేరా ఆదేశాల మేరకు ప్రెస్ బ్రీఫింగ్‌లు, టీవీ డిబేట్ల కోసం మీడియా ప్యానెలిస్టులను, మీడియా కో-ఆర్డినేటర్లను, అధికార ప్రతినిధులను నియమిస్తున్నట్లు చామల కిరణ్ కుమార్ రెడ్డి నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ప్రస్తుతం ఉన్న టీపీసీసీ అధికార ప్రతినిధులందరికీ తక్షణమే సీనియర్ అధికార ప్రతినిధులుగా పదోన్నతి కల్పిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మీడియా ప్యానెలిస్టులు:

మొత్తం 16 మందితో ఈ జాబితాను విడుదల చేశారు. ఇందులో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, డాక్టర్ జి. రాంచంద్ర నాయక్, బల్మూరి వెంకట్‌తో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ సి. వంశీకృష్ణ, టి. రామ్మోహన్ రెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎం.ఎస్. రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, కూచుకుల్ల రాజేశ్ రెడ్డి తదితరులకు చోటు కల్పించారు.

మీడియా కో-ఆర్డినేటర్లు:

నలుగురితో కూడిన ఈ జాబితాలో మీడియా చీఫ్ కో-ఆర్డినేటర్‌గా కె. శ్రీకాంత్ యాదవ్, మీడియా కన్వీనర్‌గా దామోదర్ ఆవెలి, మీడియా కో-ఆర్డినేటర్లుగా తుమ్మల పద్మ, మొగిలి సత్యారెడ్డిలను నియమించారు.

అధికార ప్రతినిధులు:

వీరితో పాటు 49 మందితో కూడిన అధికార ప్రతినిధుల జాబితాను కూడా విడుదల చేశారు. అయితే, జాబితా విడుదలైన మరుసటి రోజే నియామకాలను హోల్డ్‌లో పెట్టడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ శ్రేణుల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఎల్‌నినో దెబ్బకు వర్కింగ్ డేస్‌లో మార్పు?



న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం):

వారానికి ఐదు రోజులే పనిదినాలు పెడితే ఎలా ఉంటుంది? అని ప్రభుత్వం ఆరా తీస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ ఆఫీసుల్లో పని దినాలు కుదించి, పని గంటలు పెంచే అంశంపై డిస్కషన్ జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం అమలులో ఉన్న 6 పనిదినాల్లో రోజుకు 8 గంటల చొప్పున వారానికి 48 గంటల పాటు పనిచేస్తున్నారు. కానీ కొత్త విధానంలో పని దినాలను 5 రోజులకు కుదించి, ప్రతి రోజూ అదనంగా గంటన్నర పాటు పనిచేసే విధానాన్ని అమలు చేస్తే ఏ విధంగా ఉంటుందోనని సీనియర్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఎల్ నినో కారణంగా నీటి, కరెంట్ లభ్యత ఇబ్బందిగా ఉండటంతో పనిదినాలను కుదించాలంటూ ఇప్పటికే ఉద్యోగ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ అంశంపై సాధ్యాసాధ్యాలను స్టడీ చేస్తోన్న ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. పిల్లల చదువులకు ఇబ్బంది రాకుండా ఉండేందుకు వారానికి ఐదు రోజుల పని విధానాన్ని కేవలం ప్రభుత్వ ఆఫీసులకు పరిమితం చేసి, విద్యాసంస్థలకు మాత్రం వారానికి 6 రోజుల పని విధానాన్ని అమలు చేయాలనే చర్చ కూడా ప్రభుత్వ వర్గాల్లో నడుస్తున్నట్లు సమాచారం.

పెరుగుతున్న నీటి సమస్య..

హైదరాబాద్‌లో మంచి నీటి సమస్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. నీటి కొరత కారణంగా పలు ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం అమలు చేస్తున్నాయి. అలాగే, పనివేళల్లో ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండటంతో ఏసీల వినియోగం పెరిగి కరెంటు వినియోగం పెరుగుతున్నది. ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోంకు ప్రయారిటీ ఇస్తున్నాయి. మరోవైపు పలు కార్పొరేటు కాలేజీలు నీటి కొరత కారణంగా కాలేజీలు, హస్టల్స్‌ను మూసివేసి, ఆన్ లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నాయి.

ముగిసిన మరో బంధం

మొదటి పేజీ తరువాయి



పిల్లల పెంపకం, వారి భవిష్యత్తు మరియు సంతోషమే తమ మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు. ఈ సమయంలో తమ వ్యక్తిగత జీవితాన్ని గౌరవించి, ప్రైవసీకి భంగం కలిగించవద్దని కోరారు.

ఈ తాజా పరిణామంతో పవన్ కళ్యాణ్ గత వైవాహిక జీవితం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పవన్ కళ్యాణ్ 1997లో నందినిని వివాహం చేసుకున్నారు. అనంతరం మనస్పర్థల కారణంగా వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు. సహనటి రేణు దేశాయ్‌ను 2009లో పెళ్లి చేసుకున్నారు. వీరి బంధం కొన్నేళ్లపాటు కొనసాగి, 2012లో విడాకులతో ముగిసింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2013 సెప్టెంబర్ 30న అన్నా లెజ్నెవాతో పవన్ కళ్యాణ్ మూడో వివాహం జరిగింది. వీరిద్దరికీ ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుదీర్ఘ దాంపత్యం అనంతరం 2026లో వీరు కూడా పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నారు. మొత్తంగా పవన్ కళ్యాణ్‌కు నలుగురు పిల్లలు ఉండగా-రేణు దేశాయ్‌తో ఇద్దరు, అన్నా లెజ్నెవాతో ఇద్దరు సంతానం. రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న సమయంలో ఈ పరిణామం వెలుగుచూడటం సర్వత్రా చర్చకు దారితీసింది.

మూడు రోజులు చలి మంటలే!

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే పలు జిల్లాల్లో రాత్రి వేళల్లో చలి పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో చల్లని గాలుల ప్రభావం మరింత ఎక్కువయ్యే సూచనలు ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రాష్ట్రంలోనే అత్యల్పంగా ఆదిలాబాద్ జిల్లాలో 14.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 14.7 నుంచి 15 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. సిద్దిపేట, కామారెడ్డి, సంగారెడ్డి, జనగామ జిల్లాల్లో 14.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో 18 జిల్లాల్లో 15.1 నుంచి 19.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో 16.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డైంది. దేశంలోని ఈశాన్య ప్రాంతాల నుంచి తెలంగాణ వైపు తక్కువ ఎత్తులో చల్లని గాలులు వీస్తుండటమే ఉష్ణోగ్రతలు తగ్గడానికి ప్రధాన కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వర్షాలు తగ్గుముఖం పట్టి రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుండటంతో రాత్రి, తెల్లవారుజామున చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని వాతావరణ శాఖ వెల్లడించింది. పగటి వేళల్లో ఎండ సాధారణంగానే ఉన్నప్పటికీ, సాయంత్రం నుంచి చల్లని గాలులు వీస్తున్నాయి. వేకువజామున పొగమంచు కమ్ముకునే అవకాశం ఉందని.. ముఖ్యంగా గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో రహదారులపై దృశ్యమానత తగ్గవచ్చని హెచ్చరించారు. వాహనదారులు వేగం తగ్గించి ప్రయాణించాలని, అవసరమైన చోట ఫాగ్ లైట్లు ఉపయోగించాలని సూచిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 16.1 డిగ్రీలుగా నమోదైంది. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్, శంషాబాద్ వంటి శివారు ప్రాంతాల్లో తెల్లవారుజామున చలి ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. పగటి వేళల్లో మాత్రం వాతావరణం పొడిగా, సాధారణంగా ఉండే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వర్ష సూచన లేదని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి.

రాత్రి, తెల్లవారుజామున చల్లని గాలులు ఎక్కువగా ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు, శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేటప్పుడు వెచ్చని దుస్తులు ధరించడం మంచిది. పొగమంచు ఎక్కువగా ఉన్న సమయంలో అనవసర ప్రయాణాలు తగ్గించుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు ముందు వెళ్లే వాహనానికి తగిన దూరం పాటించాలని సూచిస్తున్నారు. మొత్తంగా రాబోయే మూడు రోజులు తెలంగాణలో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలి.

స్థానిక సంస్థల్లో మరో ఎన్నికల సమరం!

మొదటి పేజీ తరువాయి

నవంబర్ 19న ఎంపీపీలు.. 20న జడ్పీపిల ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మండల ప్రజా పరిషత్‌ల (ఎంపీపీ) పరోక్ష ఎన్నికలు నవంబర్ 19, 2026న నిర్వహించనున్నారు. జిల్లా ప్రజా పరిషత్‌ల (జడ్పీపి) పరోక్ష ఎన్నికలు నవంబర్ 20, 2026న జరగనున్నాయి. ప్రత్యేక సమావేశాల ద్వారా ఈ ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మండల, జిల్లా పరిషత్‌లలో ఎన్నికైన సభ్యులు ఈ సమావేశాల్లో పాల్గొని తమ ప్రతినిధులను ఎన్నుకోనున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలకు ముందుగానే కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. మతపరమైన లేదా భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందిన వారిని కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎంపిక చేయనున్నారు. ప్రతి మండల ప్రజా పరిషత్‌కు ఒకరు, జిల్లా ప్రజా పరిషత్‌కు ఇద్దరు చొప్పున కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాలి. ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాతే అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహిస్తారు.

చేతులెత్తే విధానంలో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

ఎంపీపీ, జడ్పీపి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు చేతులెత్తే విధానంలో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల విప్ వర్తిస్తుంది. అంటే ఆయా పార్టీల సభ్యులు తమ పార్టీ జారీ చేసిన విప్‌కు అనుగుణంగా ఓటు వేయాల్సి ఉంటుంది. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నిక విషయంలో పార్టీ విప్ జారీ చేయడానికి ఎలాంటి నిబంధన లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే, ఈ ప్రత్యేక సమావేశాలకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎక్స్-అఫీషియో సభ్యులుగా హాజరుకావచ్చు. కానీ, పరోక్ష ఎన్నికల్లో వారికి ఓటు వేసే హక్కు ఉండదు. ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులే ఈ ఎన్నికల ప్రక్రియలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

నవంబర్ 14లోపు సమావేశాల నోటీసులు

పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికైన ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు ప్రత్యేక సమావేశాల నోటీసులను నవంబర్ 14, 2026లోపు అందజేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. నోటీసుల జారీ, సమావేశాల నిర్వహణ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేయాల్సి ఉంటుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా పరిషత్‌లలో అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది.

డిజిటల్ అరెస్టులపై సుప్రీం కొరడా

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం): భారతదేశంలో పెద్ద సమస్యగా మారుతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాలు, సైబర్ నేరాల కట్టడిపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇలాంటి సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రతిపాదిత రక్షణ చర్యలేమిటో సమగ్రంగా వివరించాలని ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌తో పాటు ఇతర మధ్యవర్తిత్వ సంస్థలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జైమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. 'ఇన్ రీ: విక్టిమ్స్ ఆఫ్ డిజిటల్ అరెస్ట్ రిలేటెడ్ టు ఫోర్జ్డ్ డాక్యుమెంట్స్' పేరిట సుమోటోగా స్వీకరించిన ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, తమ రక్షణ చర్యల ప్రణాళికను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు (ఐ4సి) కూడా ఏకకాలంలో సమర్పించాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను నవంబర్ 23కి వాయిదా వేసింది.

ఈ విచారణ సందర్భంగా వాట్సాప్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. సైబర్ నేరాలను అడ్డుకునేందుకు ఇప్పటికే 9,400 అనుమానాస్పద ఖాతాలపై చర్యలు తీసుకున్నామని, పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని న్యాయస్థానానికి తెలిపారు. అనుమానాస్పద ఖాతాలను స్వయంచాలకంగా గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేసే అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌పై కసరత్తు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. నకిలీ పత్రాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే డిజిటల్ అరెస్ట్ కుంభకోణాలను అరికట్టేందుకు తీసుకోబోయే పటిష్ట చర్యలను కోర్టు ముందుంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు ప్రాధాన్యమిస్తూ, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌పై కేబినెట్ సమీక్షించింది. భీమిలిలో రూ. 31,387 కోట్లతో ఏఐ ఇంటెలిజెన్స్ ఏఐ డేటా సెంటర్, నాయుడుపేటలో రూ. 4,000 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ పరిశ్రమ, రాంబిల్లిలో రూ. 570 కోట్లతో ఈప్యాక్ డేటా సెంటర్ పరికరాల తయారీ, తిరుపతిలో రూ. 700 కోట్లతో డిక్సన్ టెక్నాలజీస్, జగ్గయ్యపేటలో 30 ఎకరాల్లో మహిళా పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అలాగే భోగాపురంలో రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌కు, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటెరో గ్రూపునకు భూ కేటాయింపులు చేయగా, నిబంధనలు పాటించని తిరుపతిలోని కొన్ని సంస్థల భూ కేటాయింపులను రద్దు చేసింది. విజయవాడలో 15 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌తో పాటు సోలార్, బయోగ్యాస్ ప్రాజెక్టులకు అనుమతులిచ్చింది.సమావేశంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రత్యేక చర్చ జరిగింది. రైతు బజార్లలో తక్కువ ధరలకే బియ్యం అందిస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలపగా, కూరగాయల ధరలు తగ్గినప్పే బియ్యం ధరలను కూడా అదుపులోకి తెచ్చి ప్రజలపై భారం పడకుండా చూడాలని సీఎం ఆదేశించారు. తుఫాన్ లేదా అత్యవసర సమయంలో కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చి విద్యుత్ పునరుద్ధరణకు తీవ్రంగా శ్రమించిన విద్యుత్ సిబ్బంది సేవలను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించగా, ప్రభుత్వం చేసే ప్రతి ప్రయత్నం ప్రజలకు నేరుగా ఉపయోగపడాలని ముఖ్యమంత్రి ముగించారు.

హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ రాక!

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సమావేశం ముగిసింది. ఢిల్లీలో దాదాపు అరగంట పాటు భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, బీసీలకు ప్రాతినిధ్యం వంటి అంశాలపై చర్చించినట్లు మహేశ్ గౌడ్ వెల్లడించారు. తెలంగాణలో బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంస్థాగత కార్యక్రమాలపై రాహుల్ గాంధీకి నివేదిక అందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పీసీసీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాల వివరాలను వివరించామన్నారు. ముఖ్యంగా ఓబీసీల సమస్యలు, వారికి రాజకీయంగా కల్పించాల్సిన ప్రాతినిధ్యంపై చర్చ జరిగినట్లు మహేశ్ గౌడ్ చెప్పారు.

భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ నవంబర్ 13 లేదా 14 తేదీల్లో హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉందని మహేశ్ గౌడ్ తెలిపారు. అయితే పర్యటన తేదీలపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. భారత్ సమ్మిట్‌తో పాటు హైదరాబాద్‌లో గిగ్ వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని రాహుల్ గాంధీ సూచించినట్లు వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం గిగ్ యాక్ట్ తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో గిగ్ వర్కర్ల సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై రాహుల్ గాంధీ వారితో సమావేశమై మాట్లాడనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు తెలిపారు.

హైదరాబాద్‌లో సర్‌కు వ్యతిరేకంగా నిర్వహించనున్న సభతో పాటు మెగా బీసీ ర్యాలీకి కూడా రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు మహేశ్ గౌడ్ వెల్లడించారు. అయితే ఈ కార్యక్రమాలకు సంబంధించిన తేదీలు ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు, వివాదాలపై రాహుల్ గాంధీతో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారాలను పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చూసుకుంటారని తెలిపారు. నవంబర్ నెలలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. మరోవైపు సోనియా గాంధీ ఆత్మకథను స్వాగతిస్తున్నామని, తెలంగాణలో ఆ పుస్తకంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని పీసీసీ అధ్యక్షుడు చెప్పారు.

రైతుల పంతం నెగ్గింది.. కడెం నుంచి నీళ్లు!



న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది కద నిజం):

నిర్మల్ జిల్లా రైతుల ఆందోళన ఫలించింది. జన్నారం, దస్తురాబాద్ మండలాల్లోని చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు కడెం ప్రాజెక్టు నుంచి అధికారులు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇటీవల ఈ రెండు మండలాలకు చెందిన రైతులు తమ పంట పొలాలకు నీరు అందించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. రైతుల విజ్ఞప్తి, ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు నీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నారు.

కడెం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రకటన చేశారు. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. మంత్రులను సంప్రదించిన అనంతరం జన్నారం, దస్తురాబాద్ మండలాల రైతుల పంట పొలాలకు నీరు అందించేందుకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ఇక రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కడెం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో జన్నారం, దస్తురాబాద్ మండలాల రైతులకు ఊరట లభించనుంది.

ప్రధాని కుర్చీ వద్దు.. పిల్లలే ముఖ్యం!

మొదటి పేజీ తరువాయి

1984లో అత్త ఇందిరా గాంధీ, 1991లో భర్త రాజీవ్ గాంధీ హత్యల తాలూకు భయాలు, విషాదాలను అనుభవించిన ఆమె పిల్లలు.. ప్రధాని పదవి చేపట్టడం వల్ల ప్రాణాపాయం మరింత పెరుగుతుందని సోనియా తీవ్రంగా వ్యతిరేకించారని పుస్తకంలో పేర్కొన్నారు.

కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి.. 'ఢీక్ హై'

ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కూటమి విజయవంతం కావడంతో, 10 జన్‌పథ్‌లోని రాజీవ్ గాంధీ సమావేశ మందిరంలో కూటమి నేతలంతా సమావేశమయ్యారు. సోనియా గాంధీ తాను ప్రధాని పదవిని చేపట్టబోనని చెప్పినప్పటికీ, నేతలంతా పట్టుబట్టారు. 'మేము దీనిని అంగీకరించము.. మీరు ఈ నిర్ణయం తీసుకోలేరు' అని తేల్చిచెప్పడంతో సోనియా తీవ్ర ఒత్తిడికి గురయ్యారు. ఆ సమయంలో బయట జరిగిన పరిణామాలతో ఆమె ఉక్కిరిబిక్కిరై, బలహీనంగా 'ఢీక్ హై' అంటే సరే అని మౌనంగా అంగీకరించారట.

రాహుల్, ప్రియాంకల నిలదీత.. మారిన నిర్ణయం

ఈ విషయం తెలుసుకున్న ప్రియాంక గాంధీ వెంటనే రాహుల్ గాంధీని తీసుకుని వెళ్లి తల్లిని నిలదీశారు. 'మీరు అవును అని ఎలా చెప్పారు?' అని రాహుల్ ప్రశ్నించగా, 'వారు వినలేదు, నన్ను తీవ్రంగా ఒత్తిడి చేశారు' అని సోనియా బదులిచ్చారు. దానికి రాహుల్ స్పందిస్తూ.. 'ఒత్తిడా? మీరు ఒత్తిడికి గురవుతున్నారా.. మా గురించా?' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రియాంక కూడా ఒత్తిడికి తలొగ్గవద్దని, మీ అసలు నిర్ణయమేంటో అదే చేయాలని గట్టిగా చెప్పారు. అంతర్గతంగా తీవ్రమైన పోరాటం తర్వాత.. ఇటలీలో పుట్టి పెరిగిన తాను బిలియన్ జనాభా ఉన్న దేశాన్ని ఎలా నడిపించగలననే మీమాంస ఒకవైపు, కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు మరోవైపు ఆమెను విపరీతంగా బాధించాయి. అయితే రాత్రి నిద్రలోకి జారుకునే ముందు, 'సోనియా.. నీ అంతరాత్మకు నిజాయితీగా ఉండు. నీకు ఎప్పుడూ తెలిసిందే చేయి!' అని నిర్ణయించుకున్నారు. కొన్ని గంటల తర్వాత రాహుల్ గదికి వెళ్లి తాను ప్రధాని పదవిని చేపట్టడం లేదని, తన పాత నిర్ణయానికే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 'ఇది సరైన నిర్ణయమే' అని రాహుల్ ఆమెను హగ్ చేసుకున్నారని సోనియా తన ఆత్మకథలో తెలిపారు. చివరికి పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఎంపీలు ఎంతగా కోరినా తన అంతరాత్మ ఒప్పుకోలేదని చెప్పిన సోనియా గాంధీ.. ఆ తర్వాత డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధాని అభ్యర్థిగా ప్రతిపాదించి దేశ రాజకీయాల్లో ఓ చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.

జనవరి 25 నుంచి జనగణన..

న్యూస్ డెస్క్, 10 నవంబర్ (ఇది క

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 11-11-2026

బాధిత మహిళా ప్రొఫెసర్‌కు తెలంగాణ రక్షణ సేన సంఘీభావం



ఇది కద నిజం, రాజేంద్రనగర్ :రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలనే డిమాండ్‌తో, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్ మరియు రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ సర్వేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలోమహిళా నాయకురాళ్లు బాధిత మహిళా ప్రొఫెసర్‌కు సంఘీభావం.ఈ సందర్భంగా సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మహిళా నాయకురాళ్లను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేయడమే కాకుండా, హైదరాబాద్ మహిళా విభాగ జనరల్ సెక్రటరీ గీత గౌడ్ని పోలీసులు గాయపరచడం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, ఈ ఘటనపై ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణ సేన అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మహిళలకు అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించడం, బాధితులకు అండగా నిలబడటం మన బాధ్యత. మహిళల ఆత్మగౌరవం, భద్రత విషయంలో తెలంగాణ రక్షణ సేన ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదు. బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. ఆమెకు న్యాయం జరిగేంతవరకు తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుంది.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య , రాజేందర్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బోనగిరి ఇందిర , మేడ్చల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనుముల స్వప్న , హైదరాబాద్ మహిళా విభాగ జనరల్ సెక్రటరీ గీత గౌడ్ , ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మేడికొండ జయలక్ష్మి , ఉప్పల్ మహిళా అధ్యక్షురాలు సుధా రెడ్డి , యాకుత్‌పుర మహిళా అధ్యక్షురాలు శారద , జూబ్లీహిల్స్ మహిళా అధ్యక్షురాలు మౌనిక , మల్కాజిగిరి మహిళా అధ్యక్షురాలు జోష్ణ , మహిళా నాయకురాళ్లు నికిత, ఫాతిమా, రేణుక, వేద భవాని, అఖిల, చంద్రకళ పాతర్ల దశరథ్ ముదిరాజ్ పూజారి ప్రవీణ్ చేవెళ్ల శ్రీకాంత్ ప్రవీణ్ నాయక్ వరుణ్ గౌడ్ నవీన్ గౌడ్ నరసింహారెడ్డి మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఇది కద నిజం: యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని జె.ఎస్. గార్డెన్స్‌లో అర్హులైన లబ్ధిదారులందరికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

ముఖ్యమంత్రి ఉస్మానియాకు ఇస్తామన్న రూ.వెయ్యి కోట్లు ఎక్కడ?

- వీసీ ఉద్యోగులను పట్టించుకోకుండా ప్రభుత్వానికి గులాం గిరి చేస్తున్నడు
- ఏడాదిన్నరగా ఉస్మానియా నాన్ టీచింగ్ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవటం లేదు
- ఉస్మానియా నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలపై గవర్నర్ స్పందించాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగుల ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపిన టీఆర్ఎస్ చీఫ్





ఇది కద నిజం,హైదరాబాద్ :

ఉస్మానియా యూనివర్సిటీలో నాన్ టీచింగ్ స్టాఫ్ శ్రమను, రక్తాన్ని దోచుకుంటున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకుంటామని, వర్సిటీకి వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి జాడలేకుండా పోయాడని ధ్వజమెత్తారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఉస్మానియా నాన్ టీచింగ్ స్టాఫ్ వర్సిటీ అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద చేపట్టిన ఆందోళనకు కవిత మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ 35 ఏళ్లుగా ఉస్మానియాలో నాన్ టీచింగ్ స్టాఫ్ కు అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితే తెలంగాణ వచ్చిన తర్వాత కూడా ఉండటం క్షమించరని నేరమన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఉద్యోగులు, ప్రొఫెసర్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నట్లుగానే ఉద్యోగి ఏడ్చిన యూనివర్సిటీ బాగుండదన్నారు.

వీసీని చరిత్ర క్షమించదు

నాన్ టీచింగ్ ఉద్యోగులంతా సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వారికి అండగా ఉండాల్సిన వీసీ.. ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నారని కవిత మండిపడ్డారు. టైమ్ స్కేల్, కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉండగా వారిని కాదని కొత్త వాళ్లను నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ముందు ఉద్యోగులపై ప్రేమ చూపించాలని కోరారు. ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే వారిని వీసీ ఇబ్బందులు పెడుతున్నాడని మండిపడ్డారు. ఉస్మానియాకు 105 ఏళ్లలో తొలిసారి మాదిగా బిడ్డను వీసీని చేశామని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నాడని..కానీ నిధులు ఇవ్వకపోతే ఆయన మాత్రం ఏం చేస్తాడని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా వీసీని బలి చేసే ప్రయత్నం చేస్తున్నారా? లేదంటే వీసీయే ప్రభుత్వం కోసం ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నాడా అని నిలదీశారు. అటానమస్ గా ఉండి ఉద్యోగులకు కోసం పోరాటం చేయాల్సిన వీసీ ప్రభుత్వానికి గులాం గిరి చేయటం మంచిది కాదని చెప్పారు. యూనివర్సిటీ కోసం ప్రభుత్వం తో కొట్లాడి బాగు చేసుకున్న వీసీలను చరిత్ర గుర్తుపెట్టుకుంటుందని.. కానీ ప్రభుత్వం కోసం వర్సిటీ ప్రయోజనాలను తాకట్టు పెడితే చరిత్ర క్షమించదని వీసీని హెచ్చరించారు.

ఏడాదిన్నరగా పట్టించుకోవటం లేదు

ఏడాదిన్నరగా నాన్ టీచింగ్ స్టాఫ్ ఆందోళనలు, ధర్నాలు చేస్తుంటే ఎందుకు స్పందించటం లేదని కవిత ప్రశ్నించారు. నాన్ పర్మినెంట్ ఉద్యోగులకు ఇచ్చే ప్రయోజనాలు లేకుండా చేస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషయాల్లో ప్రదర్శించే తెలితేటలను ముఖ్యమంత్రి వద్ద ప్రదర్శించి ఉద్యోగులకు మేలు చేయాలని కోరారు. ఓయూలో 85 శాతం లోకల్ వాళ్లనే నియమించుకోవాల్సి ఉన్నప్పటికీ బీహార్, యూపీ వాళ్లను సెక్యూరిటీ కోసం నియమిస్తున్నారన్నారు. యూనివర్సిటీలో జరిగే అవినీతి బయట పడకుండా ఉండేందుకే బయట వాళ్లను నియమిస్తున్నారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. నాన్ టీచింగ్ స్టాఫ్ సమస్య లపై వర్సిటీ ఛాన్సలర్ గా ఉన్న గవర్నర్ ఎందుకు స్పందించటం లేదని ఆమె ప్రశ్నించారు. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోని నాన్ టీచింగ్ స్టాఫ్ కు మేలు జరిగేలా చూడాలని గవర్నర్ ను కోరారు.

ఓపీఎస్ అమలు చేయాలి

ఉస్మానియాలో ఉద్యోగులకు ఓపీఎస్ స్కీమ్ వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి పచ్చి అబద్దాలు చెప్పారని కవిత అన్నారు. 2001 నుంచి 2004 వరకు ఉన్న వారికి ఈ స్కీమ్ వర్తింపజేయాలన్నారు. 2004 నుంచి ఉన్న వారికి కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను వర్తింపజేయాలన్నారు. ఏటా ఉద్యోగులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని క్రమం తప్పకుండా చెల్లించాలని, చనిపోయిన టైమ్ స్కేల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల వ్యవస్థ తీసేసి అందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్కీమ్ ను రెగ్యులర్ ఎంప్లాయిస్ మాదిరిగా వర్తింజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేసే పోరాటానికి తాము అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అదే విధంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులైనా శ్రీకాంత్ గౌడ్, ఆకాష్ లకు అండగా నిలవాలని ఉద్యోగులను ఈ సందర్భంగా కవిత కోరారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



ఇది కద నిజం,రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న 'ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా వెరిఫికేషన్ ప్రక్రియపై ఈఆర్ఓ, జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కిస్మత్‌పూర్ జోనల్ కార్యాలయంలో సర్వపక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో బిజెపి తరఫున నారగూడెం మల్లారెడ్డి, కే రవీందర్ రెడ్డి, ధనంజయలతో పాటు అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సమగ్ర పరిశీలన, ఓటర్ల వివరాల ధృవీకరణ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, జాబితాలోని తప్పులు, సవరణలను సరిచేయడం వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జోనల్ కమిషనర్ అధికారులకు, పార్టీ ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా స్వచ్ఛతను కాపాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని అందరూ సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

గౌడ ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముద్దగౌని భాస్కర్ గౌడ్



ఇది కద నిజం,రాజేంద్రనగర్ :

తెలంగాణ రాష్ట్రంలో గౌడ సామాజిక వర్గం ఆత్మగౌరవాన్ని చాటేలా కోకాపేటలోని ఐదు ఎకరాల స్థలంలో గౌడ ఆత్మగౌరవ భవనం నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముద్దగౌని భాస్కర్ గౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ల ఆధ్వర్యంలో గౌడల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేలా నిధులు మంజూరు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ముద్దగౌని భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా గౌడ సమాజం ఎదురుచూస్తున్న ఆత్మగౌరవ భవనం కల నేడు కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో సాకారమవుతున్నదని పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటుతో పాటు కోకాపేటలో భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడం గౌడ సమాజానికి ఎంతో గర్వకారణమని తెలిపారు. రాబోయే రోజుల్లో గౌడ సమాజమంతా ఐక్యంగా ఉంటూ సామాజిక, రాజకీయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని ముద్దగౌని భాస్కర్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గౌడ సమాజం మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, తెలంగాణవ్యాప్తంగా గౌడ సామాజిక వర్గ ఐక్యతను చాటుతూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాముమవుతామని ఆయన వెల్లడించారు.

యాదాద్రిలో కార్తీకోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవాలు ఆలయ ఈవో భవాని శంకర్ ప్రెస్ మీట్

ఇది కద నిజం, యాదాద్రి : ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు కార్తీకోత్సవం నిర్వహించేందుకు ఆలయ అధికారులు సిద్ధమయ్యారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ మహోత్సవాల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు, భక్తి సంగీతం, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ వివరాలను ఆలయ ఈవో భవానీ శంకర్ వెల్లడించారు. కార్తీక మాస పవిత్రతను చాటడంతో పాటు భారతీయ సంస్కృతి, కళలు, తెలంగాణ వారసత్వ సంపదను ప్రోత్సహించాలనే దివ్య సంకల్పంతో దేవస్థానం ఆధ్వర్యంలో తొలిసారిగా ఈ కార్తీకోత్సవ సాంస్కృతిక మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా నవంబర్ 20వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని లక్ష్మీనరసింహ నామార్చన సహితంగా కోటి పుష్పార్చన కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి 7:30 గంటలకు తేలు విజయ జానపద భక్తి సంగీత కార్యక్రమం భక్తులను అలరించనున్నాయి.

ఇక నవంబర్ 21వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి ఆర్వీ పట్నాయక్, నిహాల్, నిత్యసంతోషిణి, గోపికా పూర్ణిమ, శ్రీనిధి, స్వప్న తదితర కళాకారులతో పాటు పరంపర సంస్థ దర్శకత్వంలో సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మూడో రోజు నవంబర్ 22న సాయంత్రం 6 గంటలకు రుద్రాక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒడిస్సీ నృత్య ప్రదర్శన, రాత్రి 7 గంటలకు అభినేత్రి బృందం ఆధ్వర్యంలో తెలంగాణ ఆలయాల ఇతివృత్తంతో నృత్య ప్రదర్శన, రాత్రి 8 గంటలకు కళాకృష్ణ బృందం పేరిణి, ఒడిస్సీ, టెంపుల్స్ ఆఫ్ తెలంగాణ నృత్య ప్రదర్శనలతో కార్తీకోత్సవాలు ముగియనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో భవానీ శంకర్ తెలిపారు. ఈ మూడు రోజుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక మహోత్సవాల్లో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని దేవస్థానం అధికారులు కోరారు.

దివ్యాంగ కార్యకర్తను సత్కరించిన ఎంపీటీసీ పిచ్చుక రాజు





ఇది కద నిజం, కుక్కునూరు: ఎన్నికల ప్రచారంలో తన కోసం కష్టపడిన కార్యకర్తల సేవలను గుర్తిస్తూ కుక్కునూరు--1 ఎంపీటీసీగా విజయం సాధించిన కూటమి టీడీపీ అభ్యర్థి పిచ్చుక రాజు, దివ్యాంగ కార్యకర్తను సయ్యద్ యాకూబ్ పాషాను తన నివాసంలో ఘనంగా సత్కరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు పూలమాల వేసి, శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో యాకూబ్ పాషా తన మూడు చక్రాల సైకిల్‌పై గ్రామంలో తిరుగుతూ కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన పిచ్చుక రాజుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడుస్తూనే ప్రచారంలో పాల్గొని తన అంకితభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పిచ్చుక రాజు మాట్లాడుతూ.. యాకూబ్ పాషాతో పాటు తన విజయానికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఓటర్లను ఎప్పటికీ మరువబోనని, ప్రతి ఒక్కరినీ గుర్తుంచుకుంటానని అన్నారు. తన విజయానికి సహకరించిన వారందరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీజీపీకి ప్రొ.జయశంకర్ వర్సిటీ వీసీ జానయ్య లేఖ



హైదరాబాద్,ఇది కద నిజం: తనపై వస్తోన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ ప్రొ.జయశంకర్ వర్సిటీ వీసీ జానయ్య డీజీపీ సీవీ ఆనంద్‌కు లేఖ రాశారు. బదిలీ చేశానన్న కోపంతోనే మహిళా ప్రొఫెసర్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనపై ఆరోపణలు చేశారని లేఖలో పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. తన పరువుకు భంగం కలిగించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. మహిళా ప్రొఫెసర్ కాల్ లిస్టుపై విచారణ చేయాలని వీసీ జానయ్య కోరారు.

"గత రెండు సంవత్సరాల్లో నేను అమలు చేసిన ప్రగతిశీల వ్యవస్థల్ని అస్థిరపరిచేందుకు ఇదో పెద్ద కుట్ర. నన్ను వ్యక్తిగతంగా దెబ్బతీయాలనేది ఆమె ప్రయత్నం. విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను దిగజార్చే దురుద్దేశంతో మాత్రమే ఈ నిరాధార ఆరోపణలు, లైంగిక వేధింపులంటూ ప్రచారం. నిజాలు నిగ్గుతేల్చి.. వెనకున్న కుట్ర కోణం బయటపెట్టాలి. మూడు నెలల కాల్ లిస్టుపై విచారణ చేసి.. వీడియో, ఆడియో కాల్స్ కూడా బయపెట్టాలి" అని జానయ్య తన లేఖలో కోరారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
బుధవారం 11-11-2026

స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా ప్రారంభమైన కార్తీక మాసోత్సవాలు





ఇది కద నిజం,స్వర్ణగిరి:

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరత్ ఋతువు, కార్తీక మాస శుక్ల పక్ష పాడ్యమి సందర్భంగా ఆలయంలో ప్రాతఃకాలం నుంచే విశేష పూజలు నిర్వహించారు. ముందుగా అర్చక స్వాములు స్వామివారికి సుప్రభాత సేవను విశేషంగా జరిపారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరిన గోపృష్ఠ దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఉదయం 5:45 గంటలకు స్వామివారి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణల నడుమ బంగారు బావి నుండి సువర్ణ బిందె తీర్థాన్ని తీసుకువచ్చారు. ఉదయం 6 గంటలకు మేళతాళాలు, మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరిత పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 7 గంటలకు స్వామివారిని మణిమయ శోభిత స్వర్ణాభరణాలు, పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్రనామార్చన సేవను ఘనంగా జరిపారు. ఉదయం 10:30 గంటలకు శ్రీవారి వైభోత్సవ మండపంలో వేదమంత్రాలు, మంగళ ధ్వనుల నడుమ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టు పీతాంబరాలు, పుష్పమాలలతో అలంకృతులైన స్వామివారి కళ్యాణాన్ని తిలకించి భక్తులు ఆనందపరవశులయ్యారు. ఇక క్షేత్రంలో నిత్యం సాగే అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 3,000 మందికి పైగా భక్తులు శ్రీవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభం వద్ద మోక్ష నారాయణ దీపాన్ని ప్రజ్వలింపజేశారు. అనంతరం సాయంత్రం 6:30 గంటలకు స్వామివారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణలు, మంగళ వాద్యాల నడుమ సాగిన ఈ ఉత్సవం తర్వాత స్వామివారు సహప్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై దర్శనమిచ్చారు. అర్చకులు వేదమంత్రాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించి కర్పూర మంగళహారతులు సమర్పించగా, భక్తులు స్వామివారిని దర్శించుకుని తారక నామస్మరణ చేశారు.

ఆల్ ఇండియా పోలీస్ టేబుల్ టెన్నిస్ పోటీలకు తెలంగాణ పోలీస్ కోచ్‌గా ఏ. అశోక్



తార్నాక (ఇది కద నిజం): తెలంగాణ పోలీస్‌కు క్రీడా రంగంలో మరో గౌరవం దక్కింది. తెలంగాణ స్పెషల్ పోలీస్ 13వ బెటాలియన్‌లో ఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఏ. అశోక్‌కు జాతీయ స్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో టేబుల్ టెన్నిస్ విభాగానికి కోచ్‌గా బాధ్యతలు అప్పగించారు.గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నవంబర్ 19 నుంచి 24 వరకు జరగనున్న 3వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్ క్లస్టర్ 2026-27 పోటీల్లో భాగంగా టేబుల్ టెన్నిస్ విభాగానికి తెలంగాణ పోలీస్ జట్టు కోచ్‌గా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ పోలీస్ క్రీడా విభాగం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.క్రీడాకారుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన అశోక్ నేడు జాతీయ స్థాయిలో కోచ్‌గా సేవలందించే స్థాయికి ఎదగడం విశేషం. ఆయనకు లభించిన ఈ అవకాశం క్రీడల పట్ల ఆయనకున్న అంకితభావానికి గుర్తింపుగా నిలిచింది.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సహచరులు, క్రీడాకారులు అశోక్‌ను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ పోలీస్ జట్టు విజయానికి ఆయన కృషి దోహదపడాలని ఆకాంక్షించారు.

సినిమా న్యూస్



‘పొలిమేర-3’లో విరావి ఎంట్రీ!

తెలుగు ప్రేక్షకులను హారర్, మిస్టరీ, సస్పెన్స్‌తో ఉర్రూతలూగించిన ‘మా ఊరి పొలిమేర’ ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో మరింత భారీగా వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ‘పొలిమేర 3’ పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జాను పరిచయం చేస్తూ విడుదల చేసిన స్పెషల్ థీమ్ పోస్టర్ ఆసక్తిని పెంచుతోంది. ఈ పోస్టర్‌లో అర్జున్ చేతిపై కనిపిస్తున్న శివుడి త్రిశూలం, విష్ణుమూర్తి సుదర్శన చక్రం టాటూలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇందులో ఆయన ‘విరావి’ అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ క్యారెక్టర్ సినిమాకు ఎలాంటి కొత్త మలుపు తీసుకురాబోతోందనే ఆసక్తి నెలకొంది. డాక్టర్ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సత్యం రాజేష్, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, బాలాదిత్య, రాకేందు మౌళి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వంశీ నందిపాటి, జాన్వీ నారంగ్, పుష్కర్ రామ్ మోహన్ రావు నిర్మిస్తున్న ఈ మూవీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. కాగా.. ‘విరావి ఆగమనం’ అంటూ రిలీజ్ చేసిన ఈ స్పెషల్ థీమ్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేస్తోంది.



రామాయణ! సరికొత్త చరిత్ర!

రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన పౌరాణిక చిత్రం ‘రామాయణ’. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ పార్ట్ 1 నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లతో సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే పలు రికార్డులు కొల్లగొట్టిన రామాయణ.. మరో అరుదైన రికార్డును ఖాతాలో వేసుకుంది. ఐదవ రోజు, పోస్ట్ దీపావళి రోజుల్లో అత్యధిక వసూళు సాధించిన భారతీయ చిత్రంగా అరుదైన ఘనత అందుకుంది.

సోమవారం ఐదో రోజు కూడా రామాయణ బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. ఐదో రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.126 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ వసూళ్లతో ఐదో రోజున అత్యధిక కలెక్షన్లు సాధించిన భారతీయ చిత్రంగా, అలాగే పోస్ట్ దీపావళి రోజుల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ సినిమా విజయాన్ని అభిమానులతో పంచుకుంది.

రామాయణ: పార్ట్ 1 ఐదో రోజు ఇండియాలో రూ.107.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. దీంతో ఐదు రోజుల్లో భారతదేశంలో మొత్తం నెట్ కలెక్షన్లు రూ.346.35 కోట్లకు చేరాయి. ఇండియా గ్రాస్ వసూళ్లు రూ.413.90 కోట్లుగా నమోదయ్యాయి. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లోనూ ఈ చిత్రం అదరగొడుతోంది. ఐదు రోజుల్లో విదేశాల్లో రూ.250 కోట్ల వసూళ్లు సాధించింది. దీంతో ఇండియా, ఓవర్సీస్ కలెక్షన్లు కలిపి ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ.663.90 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఐదు రోజుల్లోనే రూ.663.90 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించడంతో రామాయణ బాక్సాఫీస్ కలెక్షన్లపై అంచనాలు మరింత పెరిగాయి. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రూ.1,000 కోట్ల క్లబ్‌లోకి చేరనుంది. రానున్న రోజుల్లో రామాయణ మరెన్ని రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.

మైత్రీ చేతికి ‘వారణాసి’ రైట్స్!



సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న గ్లోబల్ అడ్వెంచర్ మూవీ ‘వారణాసి’. బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం.. 2027 ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కుతున్న వారణాసిపై ఏ చిన్న న్యూస్ వచ్చినా.. సోషల్ మీడియాలో ఇట్టే వైరల్ అవుతోంది. సినిమా బిజినెస్‌కు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ ‘మైత్రీ మూవీ మేకర్స్’ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఏకంగా రూ.290 కోట్ల భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ఈ డీల్‌కు సంబంధించి చిత్రబృందం లేదా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ ఒప్పందం నిజమైతే.. తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌లో సరికొత్త రికార్డుగా నిలవనుంది. ఇప్పటివరకు టాలీవుడ్ చరిత్రలో తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక బిజినెస్ చేసిన చిత్రంగా ‘ఆర్ఆర్ఆర్’ ఉంది. ఆ సినిమా థియేట్రికల్ రైట్స్ రూ.225 కోట్ల ధర పలికింది. వారణాసి థియేట్రికల్ రైట్స్ కోసం ప్రముఖ నిర్మాణ సంస్థలు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కూడా పోటీపడ్డాయని.. చివరకు మైత్రీ మూవీ మేకర్స్ దక్కించుకున్నట్లు సమాచారం.

మహేశ్ బాబు, రాజమౌళి తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో వారణాసిపై దేశవ్యాప్తంగా భారీ ఆసక్తి నెలకొంది. అంతర్జాతీయ స్థాయి కథాంశం, భారీ నిర్మాణ విలువలు, స్టార్ కాస్ట్‌తో ఈ మూవీ రూపొందుతోంది. ఈ నేపథ్యంలో సినిమా థియేట్రికల్ హక్కులకు భారీ డిమాండ్ నెలకొంది. ఈ వార్తతో మహేశ్ బాబు అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఇక ఇప్పటివరకు వారణాసి నుంచి కొన్ని స్టిల్స్, ఓ గ్లింప్స్ మాత్రమే వచ్చాయి. దీంతో మేజర్ అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఈ నవంబర్‌లో వారణాసి నుంచి మరో భారీ రివీల్ ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది.

బెట్టింగ్ పిచ్చికి కామెడీ టచ్!

యువతను పట్టి పీడిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారి, లోన్ యాప్‌ల ఉచ్చులో పడితే జీవితాలు ఎంత దారుణంగా తలకిందులవుతాయో నిత్యం వార్తల్లో చూస్తూనే ఉన్నాం. సరిగ్గా ఇదే బర్నింగ్ టాపిక్‌ను ఎంచుకుని, దానికి కావాల్సినంత కామెడీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ జోడించి టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న సరికొత్త చిత్రం ‘DNK’. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా, సుష్మిత శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను మాస్ మహారాజా రవితేజ తాజాగా లాంచ్ చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ నెట్టింట సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఈ రోజుల్లో ఈజీ మనీ కోసం యువత ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు ఎలా బానిసలవుతున్నారో ఈ ట్రైలర్‌లో కళ్లకు కట్టినట్లు చూపించారు. బెట్టింగ్ వ్యసనంతో లోన్ యాప్‌లలో, చివరకు గర్ల్‌ఫ్రెండ్ దగ్గర కూడా అప్పులు చేసి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోతాడు హీరో. డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ గర్ల్‌ఫ్రెండ్ తండ్రి ఇంటికొచ్చి వార్నింగ్ ఇవ్వడంతో.. ఆ అప్పుల ఊబి నుంచి బయటపడే మార్గం లేక ఓ సంచలన నిర్ణయం తీసుకుంటాడు. తన స్నేహితుడితో కలిసి ఏకంగా ధనవంతుల ఇళ్లలోనే దొంగతనాలకు స్కెచ్ వేస్తాడు. అయితే ఈ వరుస దొంగతనాల వెనుక ఏదో బీహార్ ముఠా ఉందని పోలీసులు ఎంక్వయిరీ మొదలుపెట్టడంతో అసలు ట్విస్ట్ మొదలవుతుంది.

‘లిటిల్ హార్ట్స్’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మౌళి తనూజ్ ప్రశాంత్ ఈ అప్పుల పాలైన యువకుడి క్యారెక్టర్‌లో జీవించేశాడు. తనదైన ఎనర్జీ, కామెడీ టైమింగ్‌తో ప్రతి సీన్‌ను రక్తి కట్టించాడు. సుష్మిత శెట్టి అమాయకపు గర్ల్‌ఫ్రెండ్‌గా క్యూట్‌గా ఆకట్టుకుంది. ఇక హీరో తల్లిదండ్రులుగా సీనియర్ నటులు అలీ, రజిత తమ మార్క్ కామెడీతో చెలరేగిపోగా.. రఘుబాబు, గుండు సుదర్శన్, ప్రియా తదితరులు కీలక పాత్రల్లో అదరగొట్టారు. నేటి జెన్-జెడ్ యువతకు కనెక్ట్ అయ్యేలా దర్శకుడు శ్రీను కంబాల ఈ కథను రాసుకున్న తీరు ఆకట్టుకుంటోంది. ఒక సీరియస్ సామాజిక సమస్యను తీసుకుని, దానికి దొంగతనాల నేపథ్యంలో ఉత్కంఠను, వినోదాన్ని జోడించి కమర్షియల్ ప్యాకేజీగా మలిచారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ నిర్మాణ విలువల మధ్య నిర్మించిన ఈ సినిమాకు సూర్య బాలాజీ విజువల్స్, సింజిత్ యెర్రమిల్లి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హైలైట్‌గా నిలిచాయి. ఇప్పటికే టీజర్, సాంగ్స్‌తో బజ్ క్రియేట్ చేసిన ‘DNK’.. నవంబర్ 13న థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల కానుంది. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఈ చిత్రం ఏ స్థాయిలో మెప్పిస్తుందో చూడాలి.

